# తెలవారింది దేవరా




**రచన :**

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

M.Tech




## ముందుమాట

ముందు నామాట వినండి అని నేను నా మనోగతం చెప్పడం నా అలవాటు. ఇదివరలో నేను శార్దూల మత్తేభవృత్తాలను చాలా తక్కువగా ఉపయోగించాను. అలా ఎందుకవుతోందో తెలియదు. కానీ నాలో అసంతృప్తి పోవటం లేదు. ఒకరోజు తెల్లవారు జామున వరుసగా శార్దూల మత్తేభాలలో శ్రీహరిని కీర్తిస్తూ వ్రాయటం మొదలు పెట్టాను. ఇక అవి అలా దూకుతూ వస్తూనే ఉన్నాయి. అలా వచ్చిందే ఈ “తెలవారింది దేవరా” ఈ పద్యాలు ఆసువుగా వచ్చినవే అవటమూ, మరియూ వాడిన భాష (పడికట్టు) నాకు అపరిచితమూ అవటం వల్ల రాత్రంతా ఎక్కడెక్కడో తిరిగిన ఆత్మ తెల్లవారగానే ఆ భాష అందుకుంటోంది. ఇదే అనుభవంతో ఇది వరకు చాలామంది ధన్యులయ్యారు. “పలికించెడివాడు రామభద్రుండట” అని అందుకే అన్నారు పోతన.



మనం తెలియకుండానే ‘పలికితే’ అది ఇంకెవరివల్ల? ఆ స్థితిలో నాకు నేనే వేరే మనిషిని.

పులులూ, మదపుటేనుగులూ ఉన్న అడివి ఈ లోకం. వాటిమీద స్వారీ చేయగలిగితే అదో వింత అనుభవం. అలాంటి అనుభవంతో ‘‘తెలవారింది దేవరా’’ వెలువడింది. ఓ దేవరా తెలవారింది లేచి పులులూ, అడవి ఏనుగులూ తిరిగే ఈ ‘అడవి’ లో వాటికి దొరకకుండా అవి నా అధీనంలో ఉండేట్లు చేయమనే వేడుకోలే ఇది.

పులులూ, మదపుటేనుగులూ కూడా ఆ స్వామికి దాసోహమే కదా. ఇదికూడా ఒక దైవారాధనే కాని కవితా ఘనతా ప్రదర్శన కాదు. నాకు ఇక్కడ ఒకమాట చెప్పాలనిపిస్తోంది. హరికథా కాలక్షేపంలో వయోలిన్ వాయించేవారికి తక్కువ పుణ్యమా? ఏనాటికి కాదు. అదే విధంగా ఏ దారైనా రాదారే (రకదారే) రాముని దారే. గోదారికాదు. ఇకమొదలెట్టండి.



## ప్రార్థన

శా॥ శ్రీవత్సంబును తాకి నవ్వె తమితో  
శ్రీదేవి సమ్మోహినై  
శైవారాధన జీవితంబు తనదై  
శర్వాణి తానుండగా  
ఆ వాణీసతి నాల్కపైన నిలువన్  
ఆరాధనల్ జేతునే  
చేవన్వారలాసంగ నాదు ఘనతై  
చేవ్రాతగా మారుగా

చం॥ గతజలసేయ బంధనము గాంచునె
లాభము ఎన్నడేనియున్
మతిగొని దీని నేర్పుడిటు మళ్ళిన
రోజున దల్చిమేలుకొ
దతిదయనీయమౌ వ్యసనమయ్యది
మానుడు రామచంద్రునిన్
అతులిత భక్తి గొల్వుడిక ఆయనె
మోయును నీదుభారమున్



మ॥ పులులున్ మత్తకరీంద్రముల్ తిరుగు యీ
భూమండలంబందునన్
చెలిమిన్ బ్రోచెడి వాడు దేవరెవరో?
శ్రీవల్లభుండాతడే
పిలువన్ పల్కును ప్రేమతో గొనును ఆ వేద్యున్
సదా గొల్తునే
కలుగన్ సౌఖ్యము ఈప్సితమ్ము కలుగన్
కళ్యాణముల్ గాంచగన్



## అంకితం

మ॥ 'సిరి!' నీకంకితమిత్తునమ్మ గొనవే
శ్రీలక్ష్మిగా పూజలన్
సరిగైకొంచును, చక్కజేతువు గదా
సామాన్య లక్ష్మీపతిన్
ధరపై జేరెడి 'రోషకత్తె' వగుటన్
దామోదరున్ వీడుచున్
వరముల్ ఇచ్చెడి వేంకటయ్య భువిపై
వర్ధిల్లగా జేస్తివే



శా॥ ఏరీ నీసరి ఎంతసేపు వెదకన్ ఈతీరుగా
నోప్రభూ!
రారా నాదరి ఒక్కసారి కనరా
రామా! అనంచేడ్చిరే
ఈరోగానికి మందు వేరె కలదే
ఈ విశ్వమందంతటన్
ఓ రామా! కనిపించుటొక్కటె కదా
యోచించగానేలరా

శా॥ చేరెన్ నీఒడి బాలుడయ్యు ఘనుడా
2 చిన్నారి ప్రహ్లాదుడా

మారీచాది మహామహోగ్ర దనజుల్
మన్నాయిరో రాఘవా

నారీగోపి పయోధరా ప్రకటిత
న్నానాసుగంధ ప్రియా!

ఏరీ నీసరి ఆర్తులన్ నిలుపగా
ఈ విశ్వమందంతటన్



మ॥ కలయో వైష్ణవ మాయయో అనుచుతా
3 కంగారు చెందెన్ కదా

తెలియన్ నేర్తురె చల్లలమ్ము లలనల్
దివ్యమ్ములౌ మాయలన్

తులువల్ చేసిన నింద నీకు ఘనుడా
దూరంబు కాకుందురే

చెలిమిన్ కోరెద నన్ను నీవు ఇటుపై
శిక్షించగా న్యాయమా?



మ॥ వినరే వీనుల విందుగా ఘనత ఆ
4 విష్ణున్ సదా ప్రీతితో

కనరే ఆతని సృష్టిలీల ప్రకృతై
కన్‌పించె కన్విందుగా

అనరే నోటితొ ఒక్కసారి ఇపుడే
ఆనంద డెందంబుతో

"కొనరా మాధవ! చేదు కోర ఇక నీ
కోపాలు చాలించరా"



శా॥ నీవీ రోజున నన్ను బ్రోచితివి
5 నే నీరాజనాలిత్తురా

నావారెవ్వరు నీవు దక్కనిదినే
నానా విచిత్రంబులౌ

ఏవోరీతులనెన్నిసార్లుగనినా
ఏనాడు లెక్కింపనే

రావే కేశవ! రక్షనీవు ననునీ
రాజ్యాన బంధించవే

మ॥ అననే ఎన్నడు రామ రామ అని నే
6 అజ్ఞానినయ్యా దయన్

గనవే పోవునదేమి చెప్పుమికవో
కారుణ్య సింధో ప్రభూ!

మనగా జాలునె జీవకోటి మహిలో
మారాడకన్ జత్తురే

గొనవే జాలిని కోపమేల వినవే
గుర్తించి నన్నేలవే



శా॥ రారా రామయనంచు ఏడ్చి 'చనియెన్'
7 రాజైన నీతండ్రియున్

రారా రాజులు బిడ్డలౌట తగదా
రారాయశోదేడ్చెగా

రారా రాఘవ వేడుకొందు ననుచున్
రాగాలతోనేడ్చిరే

రారా రాకకు కండ్లు కాచెగదరా
రక్షించ నేనేడ్చెదన్



శా॥ ఏరీరోజున నిన్నవున్న సఖులీ
8 ఇంటన్ రమావల్లభా

రారే ఒక్కరు లబ్బు లబ్బు పలుకుల్
రంజిల్లగా పల్కిరే

'కారే' ప్రేమలు గబ్బుగొట్టె వెగటై
కక్కొచ్చె సర్వేశ్వరా

మారామేలర మాటనాదు వినరా
మన్నించినన్ గానరా



శా॥ కాదే సాధ్యము కామ క్రోధమణచన్
9 కాకున్న భక్తుల్ ప్రభూ!

రాదే భక్తియు జ్ఞానమార్గమవనిన్
'రాదారి' కాకున్నచో

రాదే జ్ఞానము నీదు ప్రేమగనకన్
రారాజుకైనన్ సరే

రాదే ప్రేమయు రక్షనిన్నుగొనకన్
రాధా మనోవల్లభా!

మ॥ కనరే నీసరి కల్కెమేసి కనినా
10 గాండీవి సంరక్షకా
వినరే నీజత విశ్వమంత చనినా
వేదోద్ధరావల్లభా
అనరే నాలిక తుప్పులూడునటుగా
ఆర్తిన్ హరీయంచు, చే
కొనరే వెన్నుని జ్ఞాన బోధ అదియే
కూర్తున్ గదామోక్షమున్



మ॥ ఇరవై వందల ఏండ్ల క్రింద ధరపై
11 ఏదయ్యు ఆ క్రైస్తవం
బరయన్ పిమ్మట జన్మనెత్తిరి కదా
'అల్లా' అనే ముస్లిముల్
తిరిగెన్ భూమిని లక్షలేళ్ళ మునుపే
ధీశాలురై మానవుల్
సరియీ అందరి తండ్రి యొప్పెనొకడే
జన్నిచ్చు నీవే ప్రభూ!



మ॥ కలరే, వేలకు వేలమించి ఘనులున్
12 కావ్యాలు సృష్టించగా
ఇలపై, కావున శ్రేష్టుడందు యెవడో
ఎన్నంగ ఎట్లౌనయా
తెలియన్ సాధ్యమె వీలుకాదు తుదకా
దేవేంద్రుకైనన్ సరే
కొలువన్ ఈశుని వ్రాయుకైత యొకటే
గొప్పందురా మాధవా!



శా॥ యోచింపన్ దగునొక్కసారి జనులున్
13 యున్నందునన్ జ్ఞానమే
యెంచన్ పాపము పుణ్యమొక్కడెవడో
యెందో కలండో కదా
తా చేయూత యతండె ముస్లిమయినన్
తా క్రైస్తవుండైననున్
పెంచే తండ్రియతండె శిక్షనొసగున్
పెంపొంద సౌజన్యమే

మ॥ ఇకనీ లీలలు కట్టిపెట్టమనినే
14 నీరీతి ప్రార్థించితిన్

సకలంబైన విధంబులన్ చెలిమితో
చక్కంగ బోధించితిన్

అకటా! మానస మెంత రాక్షసి కదా
అన్యాయమౌనట్లుగా

వికటంబైనది, దీనివంచగలనో
విశ్వేశ్వరా నీకృపన్



శా॥ చైతన్యంబదె చెంతనుండు వరకే
15 జీవించె నంచందురే

మాతాతంచును ఏడ్చిసొక్కుదురయా
మానేసి తిండైనను న్

ఈతీరంతయు కొంత సేపె అటుపై
ఎక్కిళ్ళు ఏమౌగదా

వ్రాతల్ కోతలు చూచుకొందురటుపై
బాధేమి సర్వేశ్వరా



మ॥ ఘనమౌకామము తోడబుట్టి నరులన్
16 గావించు మోహాంధులన్

తనతో లోభము వెంటజేరు చెరచున్
తగ్గించు ఆలోచనన్

పనిగా మచ్చర మెక్కి పెంచు మదమున్
పట్టించు దుర్మార్గమున్

మనలన్ ముంచును కోపమెక్కి విరుచున్
మళ్ళించు సన్మార్గముఁ



మ॥ ఇదియే జ్ఞేయము మిత్రులార వినరే
17 ఇంకెందు కాలోచనల్

ఇతడే తండ్రియు తల్లికూడ ఇతడే
ఈ విశ్వవ్యాప్తుండునూ

ఇతడే పెంచును మట్టి జేయు నితడే
ఇచ్ఛామనోవర్తియై

ఇతనిన్ కొల్చుటకన్న చేయగలమే
ఈజన్మ ధన్యంబవన్

శా॥ నీదారిన్ చని చింతలేక ఘనుడా!
18 నీధ్యాస నాకబ్బెరా

ఏదో పూర్వపు సుకృతాన కలిగెన్
ఇష్టంబు నీపైననే

నాదంచేదియు లేదు సత్యమిదియే
నాభాగ్యమేమందు నే

నేదోరోజున నిన్ను చేరగలనన్
ఈ ఆశ జీవింతురా



శా॥ దేవా! నీదయ నాకు కల్గెను కదా
19 దివ్యంబుగా జ్ఞానమున్

నా వారందరు నాకు అండ అనియా
నా మౌఢ్యమే పోయెరా

నీవే నాగతి మౌనమేల ఇటుపై
నీవే శరణ్యంబురా

రావా నాదరి ప్రేమ మీర కరుణన్
రామా! దయా సాగరా!



శా॥ కాదే హాస్యము ఎంచి చూడనరులన్
20 కాదందురా చెప్పరే

ఏదో మీదయనంచు బల్కెదరుగా
హీనంబుగా దల్చియున్

నాదేమున్నది మీరులేక అనుచున్
నమ్మించి వెన్వెన్కనే

ఏదో తీరున 'గోయి' తవ్వుదురుగా
ఈ వింత నేమందురా



మ॥ తగునే వంచగ ఎండుకొమ్మనవనిన్
21 తాబట్టి విల్లంబుగా

రగిలే కామము అట్లె, వంచగలరే
రాజైన తాబానిసే

తగులున్ వీడదు భ్రష్టుజేయు నరునిన్
ధాత్రిన్ రమానాథుడే

మిగులున్ దిక్కుగ చేతులెత్తి అనుడీ
మేల్కొంచు 'నీవేగతీ'

శా॥ కాదా మోసము కంసవైరి! నరులన్
22 కామాంధులన్ జేతువే
ఆదారిన్ చనిఘోర పాపములనే
అన్యాయముల్ జేతురే
ఏదోరోజున నీదు ధ్యాస కలుగున్
ఈశా శరణ్యంబనన్
ఆదిన్ అల్లగజేంద్రుగాచు విధినే
అల్లాడు మమ్మేలవే



మ॥ వినరే శ్రద్ధగ నాదుమాట ఘనులై
23 విశ్వేశు కీర్తించరే
మనకున్ తల్లియు తండ్రి కూడ
అతడే మన్నించు దిక్కాతడే
మనుజుల్ తప్పులు చేయ దండనిడినన్
మన్నించు తప్పన్నచో
అనరే తప్పులు కాచి బ్రోవ తగనా
అల్పుండ నీదాసుడన్



శా॥ చేదన్ కష్టమనంచు నీరుగొనరే
24 శ్రేష్ఠంబులౌ బావులన్
మేదిన్ దున్నుట కష్టమంచు గొనరే
మేలైన సేద్యంబునున్
మోదంబందగ మంచి వస్త్రములకై
ముందుండి మేల్ నేయరే
చేదౌనంచును ఔషధంబు గొనరే
జీవించ నోమాధవా!



మ॥ కలదే ధర్మము దీనిమించి ఇలలో
25 కారుణ్యమే శ్రేష్ఠమౌ
కలదే అర్ధము దీనిసాటి ధరపై
కృష్ణయ్య ఆరాధనే
కలదే కామము దీనితోడి వసుధన్
కాంక్షించగా మానవుల్
కలదే మోక్షము దీనితూగు క్షితిపై
కాలంబులెందైననున్

మ॥ ఇదియే స్వర్గము దీనివీడగలనా
26 ఈతీరు చింతింతురే

ఇదియే చాలును వేని కోరనికనే
ఇట్లంచు ప్రార్థింతురే

ఇదియా స్వర్గము దీని వీడుటెపుడో
ఇంకెంత సేపు ప్రభూ

ఇదె నీభక్తులు వేరు వేరు దశలన్
ఇచ్ఛన్ ఎరిగింతురే



మ॥ సరియే దుష్టుడ నొప్పుకొందు ఘనుడా
27 సాధించకీరీతి నన్

పరమౌ నామము నాల్కపైన నిలుపన్
పాలింతువెవ్వారినో

వరముల్ వేడను ఆశలేదు గొనవే
ప్రార్థింతునో దేవరా

తరమే ఏరికి నీదుమాయ తెలియన్
ధాత్రిన్ రమావల్లభా!



మ॥ ఇదియే పుణ్యము దీనిమించిగలదే
28 ఎందైన ఎవ్వారికిన్

ఇది నాభాగ్యము నీదుపాదములపై
ఈ రీతినేనుంచితిన్

ఇదియే చాలును దేనికోరనికనే
ఈ వాంఛలింకేలరా

ఇదియే నీదయ పొందినేను ఇకపై
ఎవ్వారికోరన్ ప్రభూ



మ॥ వదిలేదెన్నడు చెడ్డయోచనలు నన్
29 బాధించు తాళన్ ప్రభూ

వదిలేదెన్నడు కోపతాపములు నన్
వద్దన్న నాతోడవే

వదిలేదెన్నడు నాదినాదనెడియీ
పైశాచి కామంబు నన్

వదలన్ జాలవు నీదుసాయమవకన్
పాదాబ్దముల్ గొల్వకన్

శా॥ రాదా నీదయ ఎన్నిసార్లు అనినా
30 రారా ననున్ బ్రోవరా

లేదే నాపయి జాలి నీకు, తెలియన్
లీలా వినోదంబులన్

కాదే సాధ్యము గొప్ప గొప్ప మునులున్
కంగారుపాలైతిరే

ఈ దీనున్ గని రక్షనీయ బరువా
ఈశా మహేశా ప్రభో



శా॥ రాదే నీకృప ఎంతవేడిఫలమే
31 రాజీవనేత్రా హరీ

వేదోద్ధారక నన్నుకావ పిలువన్
వీల్లేదనన్ న్యాయమే

కాదే ఘోరము కాళ్ళుపట్టు జనులన్
కాల్తన్ని దుర్మార్గులన్

మాదే రాజ్యమనంగ నుంచెదవు
నీ మాయల్ ఎరుంగన్ కదా



శా॥ ఏదోజన్మన చేయు పాపములకే
32 ఈ జన్మ శిక్షౌనయా

కాదానేరము విశ్వవ్యాప్తు తెగడన్
కంపించి కన్నీటితో

చేదోడాగద రక్షవేడ ప్రభువున్
శిక్షించినన్ బ్రోచుగా

నాదారేయది మీరుగూడ నడుడీ
నారాయణున్ గొల్వుడీ



మ॥ అరరే! వైరముతోటి పొందిరిగదా
33 ఆనాడు దైత్యుల్ తగన్

మరి నాభక్తికి నాకు శిక్ష ఇదియా
మన్నింపు ఈ రీతియా

సరి నీశక్తికి లేదు మారు ఘనుడా
చంపించినన్ కాదనన్

అరయన్ జూపుము నీదు రూపు కలలో
ఆపైన నేకోర నిన్

శా॥ కావాలన్నను ‘పాప’ లుండరకటా!
34 కన్నీళ్ళపర్యంతమై
కావాలన్నను ‘ తిండి ’ ఉండదరరే!
గగ్గోలుగా ఏడ్చినన్
కావాలన్నను ‘నిద్ర’ ఉండదవనిన్
గర్వంబుతోనేలినన్
కావాలన్నను చేరడచ్యుతుడు నీ
కర్మంబు పూర్తవ్వకన్



మ॥ మళయాళీయులు చేరి కొల్తురు కదా
35 మా ‘అయ్యపో’ నీవనన్
తెలుపన్ వేంకటనాధుగొప్పతనమున్
దేశాన కోకొల్లలౌ
నిలిచెన్ కాశిని విశ్వనాధుడటులే
నీమోక్షదాతాయనే
ఇలలో రాముడు కృష్ణుడంచు ప్రజలె
ల్లీతీరుగా కొల్తురే



శా॥ ఏదో జన్మమునందు నీదు కృపచే
36 ఈరీతినే వ్రాయుచున్
రాదే నీదయనంచు ఏడ్చికనవే
రామాయనన్ జచ్చితిన్
కాదేనీతరి, జీవితంబు సగమున్
గర్వాననిన్ దల్వనే
ఆ దారిన్ చని జ్ఞానమొచ్చ ఇకనిన్
ఆర్తిన్ సదా వేడెదన్



మ॥ “కరుణాసింధువు నీవు కాదనినచో
37 కాపాడు వారుందురే
తరమా ఈ పని చేయనన్యులకు నే
ధన్యుండ మీయండచే”
పరులీరీతిని బల్కి శక్తియుడుగన్
పల్కంగ రారో ప్రభూ!
నరమే లేనిది నాల్కయంచనుచు ఈ
నాడిట్లు నే నేర్చితిన్

శా॥ చింతించిందట సీతనాడు వనిలో
38 శ్రీరామ రావేయనన్

చింతించిందట రుక్మిణమ్మ గొనసై
శ్రీకృష్ణ రావేయనన్

చింతించిందట ఆ యశోద, వకుళై
శ్రీవాస రారాయనన్

చింతన్ తీర్చెడి నీవు నాకు దయతో
చేయిమ్ము ఏరూపునన్



మ॥ కదపన్ జాలను కాలుచేయి సరిగా
39 గల్లంతు ఆలోచనల్

ముదమన్ మాట తలంపు రాదు ఘనుడా!
ముప్పూట్ల తిండుండియున్

పదునున్ వీడిన పాత ఖడ్గమువలెనే
పన్లేక జీవింతు నా

నుదుటన్ గీసిన గీతమార్చనగునే
నూరేళ్ళు యత్నించినన్



శా॥ అమ్మాయంచని బిల్వ ఓరి నను నీఅయ్యుంచు
40 కున్నాడురా

కమ్మాయా పొరలిట్లు నీదు కనులన్ కాకున్న
ఇట్లుందువే

పొమ్మోరోరి పిశాచి పాడెకడుదున్ పోయంచు
నోరెత్తగా

'అమ్మారా' యిది యంచు దాని దరికే
అయ్యైన రాజూచునా?



## మంగళం

మ॥ అనరే మంగళ మౌను గాక హరికిన్
ఆ శ్రీరమాదేవికిన్

అనరే మంగళ మౌనుగాక ప్రజకున్
అత్యంత శ్రద్ధావలం

బనులై కొల్చుచు మంగళంబు కనుచున్
వాసిన్ ధనంబున్ దయన్

గొనరే, మంగళమౌను దీని చదువన్
కోట్లాది మాబోంట్లకున్